హైదరాబాద్ చారిత్రాత్మక నగరం

- భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం కొంతమందికి ఇష్టం లేదు
- మూసీ ప్రక్షాళనతో ఓల్డ్ సిటీకి పూర్వ వైభవాన్ని తీసుకొస్తాం
- గోదావరి జలాలతో 365 రోజులు మూసీలో నీరుండేలా రివర్ ఫ్రంట్
- అభివృద్ధిని అడ్డుకునే దొంగల పని పట్టాలి : సీఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

"హైదరాబాద్ చారిత్రాత్మక నగరం.. అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ గుర్తింపు పొందడానికి ఆనాటి కులీ కుతుబ్ షాహీ నుంచి ఈ నాటి వరకు ఎంతోమంది కృషి చేశారు.. వారి కృషి వల్లే ప్రపంచ చిత్రపటంలో ఒక గొప్ప నగరంగా హైదరాబాద్‌కు కీర్తి ప్రతిష్టలు దక్కాయి" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కొంత మంది అభివృద్ధిని అడ్డుకోవడానికి ప్రయత్నాలు చేస్తుంటారని, అలాంటి దొంగల పని పట్టాల్సి ఉందని అన్నారు. రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలిలో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం, ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు బుధవారం మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్ బాబుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఇంటిగ్రేటెడ్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల నిర్మాణంతో రిజిస్ట్రేషన్ కార్యాలయాలలో ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. రాజీవ్ గాంధీ కృషి వల్లే దేశంలో ఐటీ రంగం అభివృద్ధి చెందిందని, తెలంగాణలోనూ హైటెక్ సిటీ అభివృద్ధికి ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం పునాది వేసిందని తెలిపారు. ప్రపంచంలో ప్రసిద్ధిగాంచిన కంపెనీలు ఇక్కడికి వస్తున్నాయంటే ఆనాటి ముఖ్యమంత్రుల దూరదృష్టే కారణమని చెప్పారు. మూసీ ప్రక్షాళన, భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం కొంతమందికి ఇష్టం లేదని, ఆనాడు హైటెక్ సిటీ నిర్మాణాన్ని సైతం కొంతమంది అవహేళన చేశారని గుర్తు చేశారు. హైదరాబాద్ నగరానికి బెంగళూరు, చెన్నయ్ లాంటి నగరాలతో కాదు పోటీ.. టోక్యో, న్యూయార్క్ లాంటి నగరాలతో పోటీపడుతుందని సీఎం అన్నారు. తెలంగాణ సమగ్ర అభివృద్ధికి 2047 ప్రణాళికను సిద్ధం చేస్తున్నామన్నారు. పాతబస్తీ.. అది ఓల్డ్ సిటీ కాదు ఒరిజినల్ సిటీ అని, మూసీ ప్రక్షాళనతో ఓల్డ్ సిటీకి పూర్వ వైభవాన్ని తీసుకొస్తామని చెప్పారు. గోదావరి జలాలను తీసుకొచ్చి 365 రోజులు మూసీలో నీరుండేలా రివర్ ఫ్రంట్ అభివృద్ధి చేస్తామని తెలిపారు. మధ్యతరగతి ప్రజల కోసం నగరంలో రాజీవ్ స్వగృహ భవనాలను నిర్మించాలని నిర్ణయించామని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగాలంటే నగర అభివృద్ధితోపాటు విస్తరణ జరగాలని అన్నారు.

శంకుస్థాపన చేస్తున్న సీఎం రేవంత్, మంత్రులు తదితరులు

రిజిస్ట్రేషన్ కార్యాలయాల రూపురేఖలు మార్పు

ఆదాయాన్ని ఇచ్చే రిజిస్ట్రేషన్ కార్యాలయాల రూపురేఖలు మార్చే ప్రయత్నం చేస్తూ, అన్ని సౌకర్యాలతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు నిర్మించబోతున్నామన్నారు. ఫైవ్‌స్టార్ హోటల్, ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు స్థాయిలో సౌకర్యాలతో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలు నిర్మిస్తామని, ప్రభుత్వానికి రూపాయి ఖర్చు లేకుండా కార్యాలయాలు నిర్మిస్తున్నామన్నారు. 2026 జూన్ 2.. రాష్ట్ర అవతరణ దినోత్సవం నాటికి 11 ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నిర్మాణం పూర్తి చేయాలని మంత్రికి సూచిస్తున్నట్టు చెప్పారు. 2034 వరకు ప్రపంచమంతా హైదరాబాద్ నగరం వైపు చూస్తుందని, ఆ స్థాయిలో అభివృద్ధి చేసుకుందామని, నగర అభివృద్ధిని అడ్డుకునే వారు మనకు శత్రువే.. అలాంటి దొంగల పని పట్టాల్సింది మీరేనని సీఎం అన్నారు.

పేద ప్రజల సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నామని, హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా అభివృద్ధి చేసి ప్రపంచంలో మొదటి స్థానంలో పెట్టేందుకు కృషి చేస్తున్నామని మంత్రులు అన్నారు. దాదాపు 50 వేల చదరపు అడుగుల స్థలంలో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను అన్ని హంగులతో ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ స్పెషల్ సెక్రెటరీ రాజీవ్ గాంధీ హనుమంతు, జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, ఉన్నతాధికారులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్, మంత్రులు, ఎమ్మెల్యేలు

యువతకు రాజీవ్ గొప్ప స్ఫూర్తి

- రాహుల్ ప్రధానైతే 21 ఏళ్లకే ఎమ్మెల్యేగా పోటీ చేసే హక్కు
- రాజీవ్‌గాంధీ జయంతి సభలో సీఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దేశ యువతకు రాజీవ్‌గాంధీ గొప్ప స్ఫూర్తి అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని చెప్పారు. దేశ సమగ్రతను కాపాడేందుకు ఆయన తన ప్రాణాలర్పించారని గుర్తు చేశారు. పారదర్శక పరిపాలన అందించేందుకు సాంకేతికతను జోడించాలంటూ ముందుగానే ఆయన ఆలోచన చేశారని తెలిపారు. 18 ఏళ్ళు నిండిన వారికి ఓటు హక్కును కల్పించి దేశ భవిష్యత్తును నిర్ణయించే అవకాశం కల్పించారని కొనియాడారు. రాహుల్ గాంధీని ప్రధానిగా చేసుకుని 21 ఏండ్లు నిండిన వారు శాసనసభకు పోటీ చేసేలా చట్టాన్ని సవరించేందుకు కృషి చేస్తామన్నారు. ఆ కలలన్నీ సాకారం కావాలంటే దేశానికి ఆయన ప్రధాని కావాలని సీఎం ఆకాంక్షించారు. బుధవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయం వద్ద రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి ముఖ్యమంత్రి పుష్పాంజలి ఘటించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్లను కల్పించిన దార్శనికుడన్నారు. కంప్యూటర్‌ను ఆయనే దేశానికి పరిచయం చేశారని గుర్తు చేశారు. టెలికాం రంగంలో ఆయన విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని చెప్పారు. ఆయన స్ఫూర్తితోనే ఆనాడు హైదరాబాద్‌లో హైటెక్ సిటీకి పునాది పడిందని గుర్తు చేశారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా, సామాజికంగా ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. సంక్షేమం, అభివృద్ధితోపాటు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ లాంటి సామాజిక సమస్యలకు పరిష్కారం చూపామని తెలిపారు. రాజీవ్‌గాంధీ స్ఫూర్తితో రాహుల్ గాంధీని ప్రధానిగా చేసే వరకు విశ్రమించొద్దని చెప్పారు. కార్యక్రమంలో టిపిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, మాజీ ఎంపిలు వి.హెచ్, అంజన్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నివాళులర్పించారు.

త్వరలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టుల మంజూరు

- మంత్రి దామోదర రాజనర్సింహ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

త్వరలో డ్రగ్ ఇన్ స్పెక్టర్ పోస్టుల మంజూరు చేసి నియామకాలు చేపడుతామని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో డ్రగ్ కంట్రోల్ అథారిటీ (డిసిఎ) అధికారులతో ఆయన సమీక్షించారు. ప్రతి కేసులోనూ దోషులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. జనాలను తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇస్తూ, మెడిసిన్ అమ్మకాలు జరుపుతున్న కంపెనీలు, వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. స్పూరియస్, నాట్ స్టాండర్డ్ డ్రగ్స్ తయారు చేస్తున్న ఫార్మా కంపెనీలు, డిస్ట్రిబ్యూటర్లు, అమ్మకందారులపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. మెడిసిన్ అనేది ప్రజల ప్రాణాలతో ముడిపడి ఉన్న అంశం అని, ఈ విషయంలోఎలాంటి ఉపేక్ష పనికిరాదని స్పష్టం చేశారు. పదే పదే నిబంధనలు ఉల్లఘింస్తున్న సంస్థలను చట్టప్రకారం శాశ్వతంగా మూసివేయాలని ఆదేశించారు. నకిలీ, నిషేధిత మందుల తయారీ, అమ్మకం దారులపై అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేయాలని మంత్రి ఆదేశించారు. మెడిసిన్‌ను ఆహార పదార్థాలుగా చూపిస్తూ, వాటి తయారీ, అమ్మకాలు చేపడుతున్నవారిపై చర్యలు తీసుకోవాలన్నారు. యాంటి బయాటిక్ రెసిస్టెన్స్ అనేది పెద్ద ముప్పుగా పరిణమిస్తోందనీ, నిబంధనలు ఉల్లంఘించి యాంటి బయాటిక్స్ అమ్మకాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు ప్రేరేపిత మెడిసిన్ అమ్మకాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డీసీఏ డీజీని మంత్రి ఆదేశించారు. డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్ అప్‌గ్రెడేషన్ పనులను స్పీడప్ చేయాలని మంత్రి సూచించారు. ప్రజలకు క్వాలిటీ మెడిసిన్, క్వాలిటీ ఫుడ్ అందించే విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని మంత్రి స్పష్టం చేశారు.

సమీక్షా సమావేశంలో డిసిఎ డైరెక్టర్ జనరల్ షానవాజ్ ఖాసీం 2024 జనవరి నుంచి 2025 జులై వరకు సాధించిన ప్రగతిని వివరించారు. 2024లో 25,939 తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన 4,142 సంస్థలపై, 2025లో జనవరి నుంచి జులై వరకు 16,481 తనిఖీలు చేసి నిబంధనలు ఉల్లంఘించిన 2,827 సంస్థలపై చర్యలు తీసుకున్నామన్నారు. 2024 జనవరి నుంచి 2025 జులై వరకు 7,200 మెడిసిన్ నమూనాలను టెస్ట్ చేయగా, అందులో 186 నాసిరకం మెడిసిన్‌గా తేలిందనీ, సంబంధిత సంస్థలపై చట్టప్రకారం చర్యలు తీసుకున్నట్టు మంత్రికి తెలిపారు. దాదాపు 700 కేసులు నమోదు చేసినట్టు వివరించారు.

వారంలో రాష్ట్రానికి 50వేల మెట్రిక్ టన్నుల యూరియా

- కర్ణాటక నుంచి వస్తున్న 10800 మెట్రిక్ టన్నులు
- ఫలించిన కాంగ్రెస్ ఎంపిల పోరాటం : తుమ్మల

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రానికి ఈ వారంలో 50 వేల మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేసేందుకు కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ ఆమోదం తెలిపిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. కర్ణాటక నుంచి ఇప్పటికే 10800 మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని తెలిపారు. ఈ వారంలో మరో మూడు షిప్‌మెంట్‌ల ద్వారా యూరియా సరఫరాకు కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌కు కేంద్రం నుంచి ఆదేశాలు వెళ్లాయని మంత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎంపిలు పార్లమెంట్ ఆవరణలో యూరియా కొరతపై ఆందోళన చేయడం ద్వారా తెలంగాణ రైతుల కష్టాలు దేశానికి తెలిసాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపిలకు ఆయన అభినందనలు తెలిపారు. తెలంగాణకు కేటాయించిన యూరియా సకాలంలో సరఫరా చేయకుండా కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపిన కారణంగానే రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు.

బతుకమ్మ పండుగకు విస్తృత ఏర్పాట్లు

- పర్యాటక శాఖ ప్రత్యేక కార్యదర్శి జయేశ్ రంజన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బతుకమ్మ పండుగను రాష్ట్రంలో ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు పర్యాటక శాఖ ప్రత్యేక కార్యదర్శి జయేశ్ రంజన్ అన్నారు. బతుకమ్మ పండుగ-2025 నిర్వహణ ఏర్పాట్లపై బుధవారం హైదరాబాద్‌లోని బేగంపేట్ హరిత ప్లాజాలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్, వరంగల్ తదితర జిల్లాల్లో బతుకమ్మ పండుగ సంబురాలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని చెప్పారు. తెలంగాణ కళారూపాలు బతుకమ్మ పండుగలో కీలక పాత్ర పోషించనున్నట్లు తెలిపారు. పండుగ వాల్ పోస్టర్లు, సాంప్రదాయం, వేడుకల నిర్వహణ విధి విధానాలు, స్వయం సహాయక సంఘాల పాత్ర, కులవృత్తులు తయారుచేసిన వస్తువుల విక్రయాలు, కళా ప్రదర్శనలు తదితర అంశాలపై శాఖల వారీగా అధికారుల నుంచి అభిప్రాయాలను స్వీకరించారు. పండుగ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం గతం కంటే ఎక్కువ నిధులు కేటాయించనున్నట్టు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో బతుకమ్మ పండుగ ఖ్యాతిని పెంచే దిశగా అన్ని శాఖలు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సమావేశంలో స్పోర్ట్స్ అథారిటీ ఎమ్‌డి సోనిబాలా దేవి, సెర్ప్ సిఇఒ దివ్య దేవరాజన్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, టూరిజం కార్పొరేషన్ ఎమ్‌డి క్రాంతి వల్లూరి, అదనపు సిపి (ట్రాఫిక్) జోయెల్ డేవిస్, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, ప్రత్యేక అధికారి కిషన్‌రావుతో పాటు జిహెచ్ఎంసి, హెచ్ఎండిఎ, పోలీస్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల ప్రొవిజనల్ లిస్ట్ విడుదల

హైదరాబాద్ బ్యూరో : నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల ప్రొవిజనల్ లిస్టును మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు బుధవారం విడుదల చేసింది. ప్రతి అభ్యర్థి వివరాలను, ఎగ్జామ్‌లో వచ్చిన మార్కులను, వెయిటేజీ ద్వారా పొందిన మార్కులను లిస్ట్‌లో పొందుపర్చింది. ప్రతి అభ్యర్థి తాము పొందిన మార్కులు, ఇతర అంశాలను సరి చూసుకోవాలని, ఏమైనా అభ్యంతరాలుంటే ఈ నెల 26 నుంచి సెప్టెంబర్ 2వ తేదీ లోపల తెలియజేయాలని సూచించింది. అభ్యంతరాలకు వెబ్‌సైట్‌లో సదుపాయం కల్పిస్తామని పేర్కొంది.ఈ పోస్టుల కోసం పరీక్ష రాసేందుకు 42,244 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 40,423 మంది గతేడాది నవంబర్ 23న నిర్వహించిన పరీక్షకు హాజరయ్యారు. 26న ప్రిలిమినరీ కీని విడుదల చేశారు. ఈ ఏడాది మే 5న ఫైనల్ కీ, పరీక్ష ఫలితాలు విడుదల చేశారు.

చిన్నారులకు బ్రేక్ఫాస్ట్ స్కీమ్

- అంగన్వాడీ నూతన భవనాలకు ఉచిత ఇసుక
- మహిళా శిశుసంక్షేమ శాఖపై సమీక్షలో మంత్రి డాక్టర్ సీతక్క

హైదరాబాద్ బ్యూరో : అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు త్వరలో బ్రేక్ఫాస్ట్ స్కీమ్‌ను రాష్ట్రమంతటా ప్రారంభిస్తామని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) ప్రకటించారు. ప్రయోగాత్మకంగా హైదరాబాద్‌లో 139 కేంద్రాల్లో ఆ పథకాన్ని అమలు చేయగా అక్కడ 30 శాతం పిల్లలు అదనంగా పెరిగారని చెప్పారు. అంగన్వాడీ నూతన భవనాల నిర్మాణానికి ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తామని హామీనిచ్చారు. హైదరాబాద్‌లోని ఎర్ర మంజిల్‌లో గల మిషన్ భగీరథ కార్యాలయంలో మహిళా శిశుసంక్షేమ శాఖ కార్యకలాపాలపై మంత్రి సమీక్షించారు. సమావేశంలో ఆ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, జాయింట్ డైరెక్టర్లు, రీజినల్ జాయింట్ డైరెక్టర్లు, అన్ని విభాగాల హెచ్ఒడిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసేలా జిల్లా కలెక్టర్లు చొరవ చూపాలని సూచించారు. మంజూరైన 1025 అంగన్వాడీ భవనాలలో ఇప్పటివరకు 625 ప్రాంతాల్లోనే స్థలాలు గుర్తించారనీ, మిగిలిన ప్రాంతాల్లో స్థల గుర్తింపు తక్షణం పూర్తిచేయాలని ఆదేశించారు. పనుల జాతరలో నూతన భవనాలను శంకుస్థాపనలు చేయించాలని, పూర్తయిన 22 అంగన్వాడీ కేంద్రాలను స్థానిక ఎమ్మెల్యేల చేత ప్రారంభించాలని సూచించారు. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల యూనిఫాం చీరల తయారీ పూర్తయి జిల్లా కేంద్రాలకు చేరాయని, వాటిని తక్షణమే పంపిణీ ప్రారంభించాలని ఆదేశించారు. ప్రతి చిన్నారికి ఉదయం 100 మిల్లీలీటర్ల పాలు అందించే ప్రతిపాదనను పరిశీలిస్తున్నామని, ప్రతి వారం ఒక రోజు ఎగ్ బిర్యాని, ఒక రోజు వెజిటేబుల్ కిచిడి వడ్డించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

నిబద్ధత, ఆత్మవిశ్వాసానికి చిరునామాగా మహిళా పోలీసులు

- స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ సీతక్క

హైదరాబాద్ బ్యూరో : నిబద్ధతకు, ఆత్మవిశ్వాసానికి చిరునామా తెలంగాణ మహిళా పోలీసులు అని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ(సీతక్క) కొనియాడారు. వృత్తి ధర్మానికి మానవీయతను జోడిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. మహిళా పోలీసులకు అండగా ఉంటామని, వారికి ప్రత్యేక వెసులుబాటు కల్పిస్తామని హామీనిచ్చారు. బుధవారం హైదరాబాద్ పరిధిలోని రాజేంద్రనగర్‌లో గల రాజ్ బహదూర్ వెంకట్రామిరెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీ ప్రాంగణంలో తెలంగాణ మహిళా పోలీస్ రాష్ట్రస్థాయి తొలి సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సీతక్క మహిళా పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. డైరెక్టర్ జనరల్ అధికారులు అభిలాష బిస్త్, చారు సిన్హా, శిఖా గోయల్, స్వాతి లక్రాతో పాటు కానిస్టేబుల్ నుంచి ఎస్పి స్థాయి వరకు సుమారు 400 మంది మహిళా పోలీస్ అధికారులు ఈ సదస్సులో పాల్గొన్నారు. సీతక్క మాట్లాడుతూ... మహిళా పోలీసులు ఇచ్చే సలహాలు, సూచనల ఆధారంగా సంక్షేమానికి సంబంధించిన సానుకూల నిర్ణయాలు తప్పకుండా తీసుకుంటారని మంత్రి సీతక్క హామీనిచ్చారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 1973లో కేరళలోని కోజికోడ్‌లో తొలి మహిళా పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారనీ, ఆ తర్వాత దేశవ్యాప్తంగా మహిళా పోలీస్ స్టేషన్లు ఏర్పడ్డాయని గుర్తుచేశారు. ఒకప్పుడు పోలీసులు, తాను భిన్న ధ్రువాలుగా ఉన్నామనీ, మారిన పరిస్థితుల్లో ప్రజాసేవలోకి రావాల్సి వచ్చిందని ఉద్యమ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. సమాజంలో మహిళల పట్ల ఉన్న చిన్నచూపును అరికట్టే బాధ్యత కూడా పోలీసులపైనే ఉందని నొక్కిచెప్పారు. ఏటా స్పెషల్ ట్రైనింగ్ నిర్వహించాలనీ, మహిళా పోలీసులకు వీక్లీ ఆఫ్, ప్రత్యేక పని వేళల సౌకర్యాలు కల్పించే అంశాన్ని పరిశీలించాలని ఉన్నతాధికారులకు సూచించారు.

హామీ ఇచ్చాం...నేరవేర్చుతున్నాం...

- వివిధ నిర్మాణ దశల్లో 2 లక్షల ఇందిరమ్మ ఇళ్లు : మంత్రి పొంగులేటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇందిరమ్మ ఇళ్ల నిర్మిస్తామంటూ కాంగ్రెస్ ఎన్నికల్లో హామీ ఇచ్చిందనీ, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ నిర్మాణాలను నెరవేరుస్తున్నామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. రెండు లక్షల ఇందిరమ్మ ఇండ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని తెలిపారు. పదేండ్ల కాలంలో బిఆర్ఎస్ పాలకులు మాటలకే పరిమితమయ్యారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం చేతల్లో చేసి చూపిస్తున్నదని చెప్పారు. బుధవారం హైదరాబాద్ హిమయత్‌నగర్‌లోని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో నూతనంగా నిర్మించిన కాన్ఫరెన్స్‌హాల్‌ను, ఆధునీకరించిన కార్యాలయ ఛాంబర్లను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని విజయవంతం చేయడంలో ప్రభుత్వ ఉద్యోగులందరూ సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. హౌసింగ్ కార్పొరేషన్ ఎండి విపి గౌతం మాట్లాడుతూ కార్పొరేషన్‌ను పూర్తి స్థాయిలో పునరుద్ధరించే చర్యల్లో భాగంగా, జిల్లాల్లో ఏఈల నియామకంతోపాటు, అవసరమైనమేరకు ఇతర విభాగాల అధికారుల సేవలను వినియోగించు కుంటున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలులో కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది అంకితభావంతో పని చేస్తున్నారని ఈ సందర్భంగా మంత్రి అభినందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వేముల వీరేశంతోపాటు హౌసింగ్ కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలో శ్రమ దోపిడీ

- కార్మికులకు 8 నెలల వేతన బకాయిలు
- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాకతీయ మెడికల్ కాలేజీ మెన్స్, ఉమెన్స్ హాస్టళ్లలో 20 ఏళ్లుగా పనిచేస్తున్న 86 మంది కార్మికుల శ్రమను ప్రభుత్వం దోపిడీ చేస్తోందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య అన్నారు. 8 నెలలుగా వేతనాలు రాకపోవడంతో కార్మికులు తొమ్మిది రోజులుగా సమ్మె చేస్తున్నారు. హనుమకొండ జిల్లా కేంద్రంలోని ఏకశిలా (జయశంకర్) పార్కు నుంచి కలెక్టరేట్ వరకు బుధవారం భారీ ప్రదర్శన చేపట్టారు. ప్రభుత్వ మొండి వైఖరి నశించాలని, 8 నెలల బకాయి వేతనాలు చెల్లించాలంటూ నినదించారు. నిరసనలో పాల్గొన ఎస్.వీరయ్య మాట్లాడుతూ... మెడికల్ కాలేజీ అధికార యంత్రాంగం బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తోందన్నారు. టెండర్లు ఇచ్చే ముందు కార్మికుల వేతనాలు సక్రమంగా వస్తాయో లేదో చూసుకోకుండా నిర్లక్ష్యం కనబరుస్తోందని విమర్శించారు. బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, జిల్లా అధికార యంత్రాంగం చొరవ చూపి సమ్మె విరమణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులు వేతనాల కోసం రోడ్డెక్కడంతో వైద్య విద్యార్థులకు అసౌకర్యం కలుగుతున్నా.. ప్రజాప్రతినిధులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ ఎంప్లాయిాస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జిల్లపెల్లి సుధాకర్, అల్లం రమేష్, రాణి, రాజకుమారి, ఎండీ అతిక్, రాము, మంద కవిత, రవి, బాబు, శశి, సుమన్, వంశీ, ప్రశాంత్, సునిత పాల్గొన్నారు.

వివో బయోటెక్‌కు రూ.10.75 కోట్ల ఆర్డర్

ప్రజాశక్తి - హైదరాబాద్ : నగర కేంద్రంగా పని చేస్తున్న వివో బయో టెక్ లిమిటెడ్ ఓ ప్రముఖ ఔషధ, అగ్రికెమికల్ సంస్థతో రూ.10.75 కోట్ల విలువైన ప్రీక్లినికల్ టెస్టింగ్ ఆర్డర్ ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు ఆ సంస్థ తెలిపింది. ఈ ఒప్పందం కింద టాక్సిసిటీ, మ్యూటజెనిసిటీ, ఈకోటాక్సికాలజీ అధ్యయనాలు, ఆధునిక అనలిటికల్ సేవలను నిర్వహించనున్నట్లు ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ పరిశోధనలు సెంట్రల్ ఇన్సెక్టిసైడ్స్ బోర్డు అండ్ రిజిస్ట్రేషన్ కమిటీ (సిఐబిఆర్‌సి) నిబంధనలకు అనుగుణంగా జరుగుతాయని వెల్లడించింది. 'ఈ ఒప్పందం మా శాస్త్రీయ నైపుణ్యం, సాంకేతిక ప్రతిభను రుజువు చేస్తుంది. గ్లోబల్ లైఫ్ సైన్సెస్ రంగంలో నమ్మదగిన భాగస్వామిగా మా స్థానాన్ని బలోపేతం చేస్తూ, వినూత్న, సమగ్ర పరిశోధన సేవల దిశగా ఇది కీలక అడుగు' అని వివో బయోటెక్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ చంద్రశేఖర్ పట్నాయక్ పేర్కొన్నారు. ఈ ఒప్పందం వివో బయో టెక్‌ను ఫార్మా, అగ్రో-కెమికల్స్, బయోటెక్నాలజీ రంగాల్లో నాయక సంస్థగా స్థిరపర్చనుందన్నారు.

పత్తి దిగుమతులపై సుంకాల ఎత్తివేత సరైందికాదు

- ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి
- తెలంగాణ పత్తి రైతుల సంఘం డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం పత్తి దిగుమతులపై సుంకం ఎత్తివేత సరైందికాదని తెలంగాణ పత్తి రైతుల సంఘం పేర్కొంది. ఆ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. ఈ నిర్ణయం వల్ల రైతుల ఆత్మహత్యలు మరిన్ని పెరిగే అవకాశముందని ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ పుచ్చకాయల కృష్ణారెడ్డి, కో కన్వీనర్ మూడ్ శోభన్ ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. పత్తి దిగుమతులపై 11 శాతం సుంకాలను రద్దు చేయడం ద్వారా వాటి ధరలపై నేరుగా ప్రభావం పడుతుందని తెలిపారు. దేశంలోని పత్తి వ్యాపారస్తులు విదేశాల నుంచి తక్కువ ధరకు పత్తిని పెద్ద మొత్తంలో దిగుమతి చేసుకోవడంతో పాటు భారీగా నిల్వలు చేసుకుంటారని పేర్కొన్నారు. రాష్ట్రంలో అక్టోబర్‌లో పత్తి పంట మార్కెట్‌కు వస్తోందనీ, ఈ సమయంలో వ్యాపారులు సిండికేట్‌గా మారి పత్తి రైతులను దోపిడీ చేసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయంతో చిన్న, సన్నకారు పత్తి రైతులపై తీవ్రంగా నష్టపోతారనీ, కానీ జాతీయ, అంతర్జాతీయ కార్పొరేట్ సంస్థలు లాభపడతాయని పేర్కొన్నారు.

అధిక వర్షాలతో దెబ్బతిన్న రోడ్లపై ఆరా

- ప్రజారవాణాకు ఇబ్బంది లేకుండా చూడాలి
- మంత్రి కోమటిరెడ్డి ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా అధిక వర్షాలతో దెబ్బతిన్న రోడ్లపై రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధికారులను ఆరా తీశారు. బుధవారం నాడు ఆర్అండ్‌బీ అధికారులతో మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కాజ్‌వే లు, కల్వర్టులు, బ్రిడ్జిలు, కోతకు గురైన రోడ్ల వివరాలు మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు ఈ సీజన్‌లో అధిక వర్షాలతో పాడైన రోడ్లు, కల్వర్టుల వివరాలు ఆర్ అండ్ బీ అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా రవాణాకు ఇబ్బంది లేకుండా తెగిన రోడ్లు, కల్వర్టుల వద్ద తాత్కాలిక పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పాడైన రోడ్లు, వంతెనలకు సంబంధించి శాశ్వత నిర్మాణాలకు ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఆర్అండ్‌బీ రాష్ట్ర కార్యాలయంలో కంట్రోల్ సెంటర్‌కు వస్తున్న ఫిర్యాదులు, సమాచార వివరాలపై మంత్రి అడగ్గా, స్టేట్ రోడ్స్ సీఈ మోహన్‌నాయక్ ఆధ్వర్యంలో షిఫ్టుకు నలుగురు చొప్పున 24 గంటలు మానిటరింగ్ చేస్తున్నట్టు చెప్పారు. మంత్రి గత సమీక్షలో చెప్పిన ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా 37 ఆర్అండ్‌బీ డివిజన్ల నుంచి వివరాలు సేకరణ చేస్తున్నామన్నారు. 24 గంటలు అలెర్ట్‌గా ఉంటున్నామని స్పెషల్ సీఎస్ వికాస్‌రాజ్ మంత్రికి తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో సెలవుపై వెళ్ళొద్దన్న ఆదేశాలు పాటిస్తూ ప్రతి ఆర్అండ్‌బి అధికారి నిబద్ధతతో పనిచేశారని మంత్రి చెప్పారు. గత పది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వచ్చిన వరద ప్రవాహాలకు రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు ఆర్ అండ్ బీ పరిధిలో 739 చోట్ల సమస్యాత్మక రోడ్లు గుర్తించామన్నారు. అందులో 854 కి.మీ రోడ్డు దెబ్బతిందనీ, 25 చోట్ల రోడ్డు తెగిపోతే వెంటనే ఐదు చోట్ల తాత్కాలిక పునరుద్ధరణ చేశామని ప్రభుత్వ స్పెషల్ సిఎస్ మంత్రికి వివరించారు. 310 చోట్లలో కాజ్‌వేలు, కల్వర్టులు వరద ప్రవాహం ఉంటే అందులో 228 దారి మళ్లింపు చేసినట్టు పేర్కొన్నారు. రాకపోకలకు ఇబ్బంది ఉన్న 232 ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన 175చోట్ల క్లియర్ చేశామని అన్నారు. మొత్తంగా 200 చోట్లలో రోడ్లు, కాజ్ వే, మైనర్ బ్రిడ్జిలు, కల్వర్టులు తాత్కాలికంగా, శాశ్వతంగా పునరుద్ధరించాలని ప్రాథమికంగా గుర్తించినట్టు చెప్పారు. తాత్కాలిక పునరుద్ధరణకు రూ. 46 కోట్లు వరకు ఖర్చవుతుందన్నారు. శాశ్వత పునరుద్ధరణ కోసం రూ. 984 కోట్లు అవసరమవుతాయని అంచనా వేసినట్టు వివరించారు. రోడ్ల డ్యామేజీ, ప్రజల రాకపోకలకు సంబంధించి ఎలక్ట్రానిక్ మీడియా, పలు దినపత్రికల్లో వార్తలు చూశానని వాటి క్షేత్ర స్థాయి పరిస్థితి మంత్రి ఆరా తీశారు.

ZAGGLE PREPAID OCEAN SERVICES LIMITED
CIN: L65999TG2011PLC074795
Regd Off: 15th Floor, Western Block, Vamsiram - Suvarna Durga Tech Park, Nanakramguda Village, Serilingampally Mandal, GHMC Serilingampally Circle, , Ranga Reddy, Telangana, 500032.
Tel.: 040 23119049| email id: accounts.hyd@zaggle.in| Website: www.zaggle.in

14వ వార్షిక సర్వసభ్య సమావేశపు ప్రకటన

ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా తేది.14 ఆగష్టు, 2025నాటి ఏజిఎం నిర్వహణ నోటీసులో పేర్కొనట్లుగా వ్యాపార లావాదేవీలకు ఉమ్మడి వేదిక వద్ద సభ్యుల భౌతిక హాజరు లేకుండా తేది.జనవరి 15, 2021నాటి సర్క్యులర్ నెం.SEBI/HO/CFD/CMD2/CIR/P/2021/11, తేది.మే13, 2022 నాటి SEBI/HO/CFD/CMD2/ CIR/P/2022/62 మరియు తేది.జనవరి 5, 2023 నాటి SEBI/HO/CFD/Pod-2/P/CIR/2023/4 మరియు తేది.అక్టోబర్ 6, 2023 నాటి సెబీ సర్క్యులర్ నెం.SEBI/HO/DDHS/P/CIR/2023/0164, తేది.అక్టోబర్ 3, 2024నాటి సర్క్యులర్ నెం.SEBI/HO/CFD/CFD-PoD-2/P/CIR/2024/133 (సెబీ సర్క్యులర్లు) (సమిష్టిగా సర్క్యులర్లుగా సూచిస్తారు)తో చదవగల సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) దీని తేది.మే 12, 2020 నాటి సర్క్యులర్ నెం.SEBI/HO/CFD/CMD1/CIR/P/2020/79 ద్వారా మరియు సర్క్యులర్ నెం.14/2020 తేది.ఏప్రిల్ 08,2020 మరియు సర్క్యులర్ నెం.17/2020, తేది.ఏప్రిల్ 13, 2020, 20/2020 తేది.జూన్ 15, 2020, 33/2020 తేది.సెప్టెంబర్ 28, 2020, 39/2020 తేది.డిసెంబర్ 31, 2020, 02/2021 తేది.జనవరి 13,2021, 10/2021 తేదీ.జూన్ 23, 2021, 20/2021 తేది.డిసెంబర్ 08, 2021, సర్క్యులర్ నెం.3/ 2022, తేది. మే 5, 2022, 11/2022 28, డిసెంబర్ 2022, సర్క్యులర్ నెం.09/2023 తేది.సెప్టెంబర్ 25, 2023 మరియు సర్క్యులర్ నెం:09/2024 తేదీ.సెప్టెంబర్ 19,2024 (ఇకపై సమిష్టిగా ఎంసిఏ సర్క్యులర్లుగా సూచిస్తారు)తో కలుపుతూ కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంసిఏ) దీని జనరల్ సర్క్యులర్ నెం.20/2020 తేది.5 మే, 2020జారీ చేసిన సర్క్యులర్లతో చదవగల కంపెనీల చట్టం, 2013 (చట్టం) మరియు దాని కింద రూపొందించిన నియమాలకు అనుగుణంగా జాగిల్ ప్రీపెయిడ్ ఓషన్ సర్వీసెస్ లిమిటెడ్ (ది కంపెనీ) యొక్క 14వ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజిఎం) **గురువారం, 18 సెప్టెంబర్, 2025న మ.3.30గం.లకు** ఐఎస్టికి వీడియో కాన్ఫరెన్సింగ్ (వీసి)/ ఇతర ఆడియో విజువల్ విధానం (ఓఏవిఎం) ద్వారా నిర్వహించబడును.
పై పేర్కొన్న సర్క్యులర్స్ మరియు చట్టంను అనుసరించి, 14వ ఏజిఎం నోటీసు మరియు 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కంపెనీ వార్షిక నివేదిక ('వార్షిక నివేదిక') ఎలక్ట్రానిక్ విధానం ద్వారా మాత్రమే కంపెనీ/రిజిస్ట్రార్ మరియు ట్రాన్స్‌ఫర్ ఏజెంట్/డిపాజిటరీలతో రిజిస్టర్ చేయబడిన సభ్యుల ఇమెయిల్ ఐడిలకు పంపబడతాయి. వార్షిక నివేదికను యాక్సెస్ చేయడానికి వెబ్‌లింక్ మరియు క్యూఆర్ కోడ్‌ను అందించే లేఖ కంపెనీ/రిజిస్ట్రార్ & ట్రాన్స్‌ఫర్ ఏజెంట్ / డిపాజిటరీలతో తమ ఇమెయిల్ అడ్రస్‌ను నమోదు చేసుకోని సభ్యులకు పంపబడుతుంది.
ఏజిఎం నోటీసు మరియు వార్షిక రిపోర్టు కంపెనీ వెబ్‌సైట్: www.zaggle.in, కెఫిన్ టెక్నాలజీస్ లిమిటెడ్ యొక్క వెబ్‌సైట్, కంపెనీ యొక్క రిజిస్ట్రార్ మరియు ట్రాన్స్‌ఫర్ ఏజెంట్ (కెఫిన్‌టెక్/ ఆర్టీఏ) https://evoting.kfintech.com మరియు స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల వెబ్‌సైట్‌లు అనగా నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా లిమిటెడ్: www.nseindia.comలో మరియు బిఎస్ఇ లిమిటెడ్: www.bseindia.comలో కూడా అందుబాటులో ఉంటాయి.
సభ్యులు వీసి/ఓఏవిఎం సౌకర్యం ద్వారా మాత్రమే ఏజిఎంకి హాజరుకాగలరు మరియు పాల్గొనగలరు. ఏజిఎంలో చేరడానికి సూచనలు మరియు రిమోట్ ఇ-ఓటింగ్‌లో పాల్గొనే విధానం లేదాఏజిఎంసమయంలో ఇ-ఓటింగ్ సిస్టమ్ ద్వారా ఓటు వేసే విధానం ఏజిఎం నోటీసులో అందించబడ్డాయి. వీసి/ఓఏవిఎం సౌకర్యం ద్వారా హాజరయ్యే సభ్యులను కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 103 ప్రకారం కోరంని లెక్కించే ఉద్దేశ్యంతో లెక్కలోకి తీసుకోబడును.
ఏజిఎం ('రిమోట్ ఇ-ఓటింగ్') వేదిక కాకుండా వేరే ప్రదేశం నుండి ఎలక్ట్రానిక్ ఓటింగ్ సిస్టమ్‌ను ఉపయోగించి సభ్యుడు ఓటు వేసే సదుపాయం అలాగే ఏజిఎం సమయంలో ఓటు వేసే సౌకర్యం కెఫిన్‌టెక్ ద్వారా అందించబడుతుంది. ఓటింగ్‌కు సంబంధించిన వివరణాత్మక విధానం ఏజిఎం నోటీసులో ఇవ్వబడినవి.
మీ ఇ-మెయిల్ ఐడి ఇప్పటికే కంపెనీ/ఆర్‌టిఏ/డిపాజిటరీలతో రిజిస్టర్ చేయబడిఉంటే, ఇ-ఓటింగ్ కోసం లాగిన్ వివరాలు మీ రిజిస్టర్డ్ ఇ-మెయిల్ ఐడికి పంపబడతాయి.
ఎలక్ట్రానిక్ రూపంలో షేర్లను కలిగి ఉన్న మరియు వారి ఇమెయిల్ అడ్రస్‌లను నమోదు చేసుకోని సభ్యులు వారి డిపాజిటరీ పార్టిసిపెంట్‌ను సంప్రదించి వారి డిపాజిటరీ పార్టిసిపెంట్ సూచించిన విధానం ప్రకారం వారి ఇమెయిల్ అడ్రస్‌లను నమోదు చేసుకోవాలని అభ్యర్థించారు.
తదుపరిగా, భౌతిక రూపంలో షేర్లను కలిగి ఉన్న ఇతర సభ్యులు సక్రమంగా నింపి సంతకంచేసిన ఫారమ్ ఐఎస్ఆర్-1ని సమర్పించాలని అభ్యర్థించారు, దీనిని https://ir.zaggle.in/wp-content/uploads/2024/03/isr-1.pdf వెబ్‌లింక్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. సెబీ ఆదేశించిన విధంగా, పాన్ కార్డ్ మరియు ఇతర సంబంధిత పత్రాల స్వీయ-ధృవీకరించబడిన కాపీతో పాటు, దాని సర్క్యులర్ ద్వారా ఆగస్టు 25, 2025న సా.5:00గం.లకు లేదా అంతకు ముందు కంపెనీస్ ఆర్‌టిఏ ద్వారా einward.ris@kfintech.com కు దరఖాస్తు చేసుకోండి.
పై సమాచారం కంపెనీ సభ్యులందరి సమాచారం మరియు ప్రయోజనం కోసం జారీ చేయబడుతోంది మరియు ఎప్పటికప్పుడు జారీ చేయబడిన పైన పేర్కొన్న సర్క్యులర్‌లకు అనుగుణంగా ఉంటుంది.

తేది: 20-08-2024
ప్రదేశం: హైదరాబాద్

సం/- హరి ప్రియా
కంపెనీ సెక్రటరీ అండ్ కంప్లియన్స్ ఆఫీసర్
M.No.: A22232

ప్రముఖ విద్యావేత్త చిన్నవెంకట్ రెడ్డి మృతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రముఖ విద్యావేత్త, సాహితీ అభిలాషకులు, నల్లగొండ పట్టణ ప్రముఖులు కొండకింది చిన్న వెంకట్‌రెడ్డి బుధవారం మరణించారు. ఆయన భౌతికకాయాన్ని బుధవారం మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. వెంకట్‌రెడ్డి విద్యా, సాహితీవేత్తగా నల్లగొండ ప్రజలకు ఎన్నో సేవలు అందించిన ప్రముఖులని, ఆయన మరణం ఎవరూ పూడ్చలేనిదని అన్నారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు గాదరి కిషోర్ కుమార్ నివాళులర్పించారు. అనంతరం చిన్న వెంకట్‌రెడ్డి అంతిమయాత్రలో పాల్గొన్నారు. నివాళు లర్పించిన వారిలో రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మెన్ కటికం సత్తయ్యగౌడ్, నల్లగొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ చీర పంకజ్ యాదవ్, బీఆర్ఎస్ అధ్యక్షులు భువనగిరి దేవేందర్, మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

నంద్యాల నర్సింహారెడ్డి సంతాపం

ప్రముఖ విద్యావేత్త కొండకింది చిన్న వెంకట్‌రెడ్డి మృతిపట్ల నల్లగొండ మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో సంతాపం ప్రకటించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వెంకట్‌రెడ్డి నల్లగొండలో విద్యారంగం అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

హైటెక్స్‌లో 5 నుంచి డిజైన్ డెమోక్రసీ ప్రదర్శన

ప్రజాశక్తి - హైదరాబాద్ : డిజైన్, కళలు భవిష్యత్ ఆలోచనకు హైదరాబాద్ వేదికగా మారనుంది. హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో సెప్టెంబర్ 5-7 తేదీల్లో ఈ ప్రదర్శన జరగనుందని ఆ సంస్థ కో ఫౌండర్ శైలజా పట్వారి తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇక్కడ 120 పైగా బ్రాండ్‌లు, 80 పైగా స్పీకర్లు, 15వేల మంది సందర్శకులతో ఫర్నిచర్, లైటింగ్, ఫ్లోరింగ్, హోమ్ ఫర్నిషింగ్స్, కిచెన్ అండ్ బాత్, డెకర్, ఫైన్ ఆర్ట్‌లను ఎగ్జిబిటర్లు ప్రదర్శించనున్నారన్నారు. రెజా కాబూల్, సుసానే ఖాన్, అక్షత్ భట్ వంటి 80 మంది వక్తలు డిజైన్ రంగంలో అవకాశాలపై చర్చలో పాల్గొంటారని తెలిపారు.

గోద్రెజ్ అగ్రోవెట్ నుంచి 'ఆశితాకా' కలుపుమందు

ప్రజాశక్తి - హైదరాబాద్ : పంట సాగులో కలుపు మొక్కలను నాశనం చేయడానికి తాము కొత్తగా 'ఆశితాక' పురుగు మందులను అందుబాటులోకి తెచ్చామని గోద్రెజ్ ఆగ్రోవెట్ సిఇఒ (క్రాప్ ప్రొడక్షన్) ఎన్‌కె రాజవేలు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో దీనిని ఆయన ఆష్కరించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఇది మొక్కజొన్న సాగులో పంట నష్టం వాటిల్లకుండా కలుపు నివారణకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ముఖ్యంగా గడ్డి జాతి మొక్కలు 2-4 ఆకులు వచ్చిన దశలో ఉన్నప్పుడు మరింత సమర్థంగా పని చేస్తుందన్నారు. ఎకరాకు 400 మిల్లీలీటర్ల సర్ఫక్టెంట్‌తో పాటు 50 ఎంఎల్ అశితాకా కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. దేశవ్యాప్తంగా మొక్కజొన్న అధికంగా పండించే తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ముందుగా ఈ ఉత్పాదనను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు.

రెడ్కో నూతన చైర్మన్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర పునరుద్ధరణీయ ఇంధన అభివృద్ధి సంస్థ (టిజిరెడ్కో) నూతన చైర్మన్‌గా రిటైర్డ్ ఐఎఎస్ అధికారి డాక్టర్ ఏ శరత్ ఖైరతాబాద్‌లోని రెడ్కో ప్రధాన కార్యాలయంలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రెడ్కో వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వి.అనీల, జనరల్ మేనేజర్ జిఎస్‌వి ప్రసాద్, డిప్యూటీ జనరల్ మేనేజర్ (ఫైనాన్స్) అనిల్, డిప్యూటీ జనరల్ మేనేజర్ (టెక్నికల్) వెంకటరమణతో పాటు ప్రాజెక్ట్ డైరెక్టర్లు, మేనేజర్లు, సిబ్బంది నూతన చైర్మన్‌కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ శరత్ మాట్లాడుతూ కొత్త సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని చెప్పారు. ప్రజలకు మెరుగైన, సమర్థవంతమైన సేవల్ని అందించేందుకు కృషి చేయాలని తెలిపారు. దేశవ్యాప్తంగా పునరుత్పాదక ఇంధనంపైనే ప్రభుత్వాలు ప్రధాన దృష్టి సారిస్తున్నాయపి, రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా విధుల్ని నిర్వహించాల్సి ఉంటుందన్నారు.

పోరాడితే పాలకులు వినాల్సిందే

- జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ శాంతా సిన్హా
- నవంబర్ 1, 2 తేదీల్లో హైదరాబాద్‌లో అఖిల భారత శ్రామిక మహిళా సమన్వయ కమిటీ 13వ జాతీయ సదస్సు
- శ్రామిక మహిళా సమన్వయ కమిటీ ఆహ్వాన సంఘం ఏర్పాటు

కార్యక్రమంలో మాట్లాడుతున్న శాంతాసిన్హా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళా కార్మికులు గట్టిగా గొంతెత్తి పోరాడి పాలకులు భయపడి వినాల్సిందేననీ, అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికుల, తదితర పోరాటాల్లో ఇది నిరూపితమైందని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ శాంతాసిన్హా అన్నారు. పాలకులు దిగొచ్చి డిమాండ్లను నెరవేర్చేలా పోరాటాలు రూపొందించే శక్తి మహిళా కార్మికులకు ఉందని చెప్పారు. మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహించడంలో సిఐటియు ముందంజలో ఉందని కొనియాడారు. బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అఖిల భారత శ్రామిక మహిళా సమన్వయ కమిటీ 13వ జాతీయ సదస్సు సన్నాహక సమావేశం, ఆహ్వాన కమిటీ ఏర్పాటు కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ శ్రామిక మహిళా సమన్వయ కమిటీ కన్వీనర్ ఎస్వి .రమ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శాంతాసిన్హా మాట్లాడుతూ ఇంట గెలిచి రచ్చ గెలవాలనే సామెత పాతబడిపోయిందని, ఇప్పుడు మహిళ బయట గెలిస్తేనే ఇంట్లో కూడా గౌరవం పెరుగుతుందని నొక్కి చెప్పారు. ఇంటి నుంచే సమానత్వం మొదలు కావాలని ఆకాంక్షించారు. ఆడపిల్లలకు చిన్నతనంలోనే పెళ్లిళ్లు చేయొద్దని, ఉన్నత చదువులు చదివించాలని కోరారు. కళ్యాణలక్ష్మి పథకానికి వెచ్చించిన రూ.తొమ్మిది వేల కోట్లను విద్య మీద ఖర్చుపెడితే రాష్ట్రం ఎంతో బాగుపడేదని అభిప్రాయపడ్డారు. సదస్సు విజయవంతం కోసం తన వంతు సహకారం అందిస్తానని హామీనిచ్చారు.

సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు మాట్లాడుతూ సమాజంలో, దేశ ఉత్పత్తిలో కీలకపాత్ర పోషిస్తున్న శ్రామిక మహిళల సమస్యలు పరిష్కరించడంలో, హక్కులు నిలబెట్టడంలో సిఐటియు మొదటి నుంచీ ప్రత్యేక కృషి చేస్తోందని వివరించారు. పాలకులు నేడు అన్ని రంగాల్లో మహిళలను విస్తరిస్తున్నారనీ, వారంతా కార్మిక చట్టాల పరిధికి దూరంగా ఉన్నారని చెప్పారు. శ్రామిక మహిళా సమన్వయ కమిటీ సహకారంతో రాబోయే రోజుల్లో స్కీమ్ వర్కర్లతో పాటు వివిధ రంగాల్లో పెద్ద సంఖ్యలో పనిచేస్తున్న మహిళల హక్కుల కోసం పోరాడుతామని చెప్పారు. నవంబర్ 1, 2 తేదీల్లో హైదరాబాద్‌లో జరగబోయే అఖిల భారత శ్రామిక మహిళా జాతీయ సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ '4 లేబర్ కోడ్స్' పేరుతో కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని విమర్శించారు. కేంద్రం తీరుతో శ్రామిక మహిళలు ఎక్కువగా ప్రభావితమవుతున్నారనీ, కుటుంబం కోసం మహిళలు రోజుకు 6 గంటలకుపైగా శ్రమించి మళ్లీ పనిప్రదేశాల్లో కష్టపడుతున్నా వారి శ్రమకు తగిన గుర్తింపు దక్కట్లేదన్నారు. పనిప్రదేశంలో లైంగిక వేధింపులు తీవ్రమవుతున్నాయని చెప్పారు. సదస్సు సందర్భంగా శ్రామిక మహిళలు ఎక్కువగా ఉన్న రంగాల్లోకి వారి సమస్యలపై సర్వేలు నిర్వహించాలనీ, అప్పుడే ఆయా రంగాల్లోని కార్మికుల్లోకి చేరుకోగలుగుతామని అన్నారు. టిఎస్‌డబ్ల్యూటిఎఫ్ నాయకులు సంయుక్త, శారద, జర్నలిస్ట్ షేక్ సలీమ, బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర మహిళా కన్వీనర్ పద్మావతి, సిఐటియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి సమావేశానుద్దేశించి మాట్లాడారు. సన్నాహక సమావేశంలో సిఐటియు ఆఫీస్ బేరర్లు పి.జయలక్ష్మి, కాసు మాధవి, జె.వెంకటేష్, వంగూరు రాములు, వివిఎస్.రావు, కూరపాటి రమేష్, జె.చంద్రశేఖర్, బి.మధు, గోపాలస్వామి, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.కోటంరాజు, పి.సుధాకర్, ఎ.సునీత, ఎస్ఎస్ఆర్ఎ. ప్రసాద్, ఏఐఐఇఎ మహిళా కన్వీనర్ వి.మైథిలి, ఇఐసి సీనియర్ నాయకులు ఎన్.ఎస్. శైలజ, గాంధీ నర్సింగ్ కాలేజ్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ సిహెచ్.రోజా రాణి, సిఐటియు అనుబంధ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రామిక మహిళా సమన్వయ కమిటీ ఆహ్వాన సంఘ ఏర్పాటు

అఖిల భారత శ్రామిక మహిళా సమన్వయ కమిటీ 13వ జాతీయ సదస్సు నిర్వహణ కోసం ఆహ్వాన సంఘాన్ని ఎన్నుకున్నారు. 60 మందితో ఆహ్వాన సంఘం ఏర్పడింది. చైర్‌పర్సన్‌గా డాక్టర్ శాంతా సిన్హా, చీఫ్ ప్యాట్రన్‌గా చుక్కరాములు, కో-చైర్మెన్‌గా పాలడుగు భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా ఎస్వీ.రమ, కోశాధికారిగా ఎం.పద్మశ్రీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

యూరియా ఇచ్చే పార్టీకే ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతు

- కెటిఆర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర రైతులకు కావాల్సిన రెండు లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను సెప్టెంబర్ 9వ తేదీ లోపు ఇచ్చిన పార్టీకే ఉపరాష్ట్ర పతి ఎన్నికల్లో తమ మద్దతు ఉంటుందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్ నందినగర్‌లోని తన నివాసంలో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి అసమర్థతోనే ఎరువుల కొరత ఏర్పడిందనీ, ప్రతి గ్రామంలో రైతులు చాంతాడంత లైన్లు కడుతున్నారని తెలిపారు. యూరియాను అక్రమ పద్ధతుల్లో తరలించి కాంగ్రెస్ నాయకులే బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకుంటున్నారని, దీనిపై కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎరువుల కొరతపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన కోరారు.

కెసిఆర్ పదేళ్ల పాలనలో యూరియా కొరత లేదని గుర్తుచేశారు. సీజన్‌కు ఆరు నెలల ముందు 24 గంటలు పర్యవేక్షణ చేసి ఎరువులను తీసుకొచ్చే వారన్నారు. రాష్ట్రంలో 70 లక్షల మంది రైతులు యూరియా కోసం అల్లాడుతుంటే కాంగ్రెస్, బిజెపిలు ఎలక్షన్లు, కలెక్షన్లంటూ నాటకాలాడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్వేతపత్రం విడుదల చేయకుంటే క్షేత్రస్థాయిలో పోరాట కార్యాచరణను ప్రటిస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో ఎనిమిది మంది కాంగ్రెస్, ఎనిమది మంది బిజెపి ఎంపిలు ఉండి ఏం ప్రయోజనమని ఆయన ప్రశ్నించారు. యూరియా కొరతపై పార్లమెంటులో రాహుల్ గాంధీ ఎందుకు నిలదీయలేదని అడిగారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల తేదీ నాటికి తమ వైఖరిని వెల్లడిస్తామని కెటిఆర్ తెలిపారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షల మేరకే తమ నిర్ణయం ఉంటుందని వెల్లడించారు. రేవంత్ రెడ్డి పెట్టిన అభ్యర్థి అయితే కచ్చితంగా వ్యతిరేకిస్తామనీ, ఆ పార్టీ చిల్లర పార్టీ, థర్డ్ క్లాస్ పార్టీ అని విమర్శించారు. తెలంగాణ ప్రజలను అరిగోస పెడుతున్న కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి పెట్టిన అభ్యర్థిని మేం ఎలా సపోర్ట్ చేస్తాం? అని ప్రశ్నించారు. బీసీల మీద ప్రేమ కురిపించే కాంగ్రెస్ పార్టీ మరి బిసి నాయకుడిని ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎందుకు పెట్టలేదు? కంచ ఐలయ్య లాంటి మేధావులను పోటీలో పెట్టొచ్చు కదా అని కామెంట్ చేశారు. కాంగ్రెస్, బీజేపీలతో తెలంగాణకు పైసా ప్రయోజనం రాదు. వాటిని పట్టించుకోవాల్సిన అవసరం తెలంగాణ ప్రజలకు లేదు. 11 సంవత్సరాలుగా తెలంగాణకు బీజేపీ చేసింది గుండుసున్న అని ఆయన విమర్శించారు. మద్దతు కోసం తమను ఏ కూటమి సంప్రదించలేదని స్పష్టం చేశారు.

మూఢ విశ్వాసాల నిరోధక చట్టాన్ని చేయాలి

- పలువురు వక్తలు
- జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వాల్ పోస్టర్ ఆవిష్కరణ

వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న పలువురు వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గుజరాత్, మహారాష్ట్ర, కర్నాటక, బీహార్ రాష్ట్రాల తరహాలో మూఢ విశ్వాసాల నిరోధక చట్టాన్ని తెలంగాణ రాష్ట్రంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. తెలంగాణ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'మూఢ విశ్వాసాల నిరోధక చట్టం అమలు'కు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షులు నందిని సిదారెడ్డి మాట్లాడుతూ.. త్యాగంతోనే దేశం, సమాజం ముందుకు పోతోందని, ప్రజల కోసం అనేక మంది విజ్ఞాన శాస్త్రాన్ని జనవిజ్ఞాన వేదిక ద్వారా ముందుకు తీసుకెళ్లారని చెప్పారు. చీకట్లను ఛేదించి, వెలుగులోకి వెళ్లడానికి జన విజ్ఞాన వేదిక కృషి చేయాలని సూచించారు. నేటి కంప్యూటర్ యుగంలో కొత్త మూఢ నమ్మకాలు వచ్చాయని, జాతకాలు, గోత్రాలు, మంత్రాల నమ్మకాలు ఎక్కువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. దెయ్యాలు, భూతాలు ఉన్నట్టు సినిమాలు, హత్యలు, నేరాలు, మూఢ నమ్మకాలు ఉన్న సినిమాలే ఎక్కువ వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటి నివారణకు, ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు జన విజ్ఞాన వేదిక కృషి చేయాలని కోరారు.

కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ.. విద్యాసంస్థల్లోనూ మూఢ నమ్మకాలు విపరీతంగా పెరిగిపోయాయని, రాజ్యమే మూఢత్వంలో పోతోందని విమర్శించారు. శాస్త్రీయ భావజాలాన్ని రాజ్యాంగబద్ధంగా కొనసాగించాలన్నారు. జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు రాజా, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, ప్రముఖ సినీ దర్శకులు ఉమామహేశ్వర్‌రావు, సాహితీవేత్త శాంతారావు తదితరులు మాట్లాడారు. ఆర్టికల్ 51ఏ (హెచ్)ను సమర్థించాలని, విద్య, పాలన నుంచి సైన్స్ కమ్యూనికేషన్, ప్రజా చేరువ వరకు అన్ని రంగాల్లోనూ శాస్త్రీయ దృక్పథాన్ని ప్రోత్సహించడం ద్వారా ప్రభుత్వాలు రాజ్యాంగ విధిని చురుకుగా నెరవేర్చుతాయన్నారు. విద్య, ఆరోగ్యం, శాస్త్రీయ పరిశోధన, మానవీయ శాస్త్రాలు, కళలలో ఎక్కువ ప్రజా పెట్టబడులు పెట్టాలని కోరారు. అంతకుముందు నేషనల్ సైంటిఫిక్ టెంపర్ డేను పురస్కరించుకుని.. ప్రజల కోసం విజ్ఞాన శాస్త్రాన్ని అందించి ఆయా దాడుల్లో చనిపోయిన అమరులకు నివాళలర్పించారు.

మద్యం షాప్‌లకు నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో మద్యం దుకాణాల లైసెన్స్‌ల జారీకి గెజిట్ నోటిఫికేషన్ విడుదలైంది. రాష్ట్రంలో 2,620 మద్యం షాపులున్నాయి. మద్యం దుకాణాల ప్రస్తుత లైసెన్స్‌ల గడువు ఈ ఏడాది నవంబర్‌తో ముగియనుంది. గౌడ్‌లకు 15 శాతం, ఎస్‌సిలకు పది శాతం, ఎస్‌టిలకు ఐదు శాతం రిజర్వేషన్లు వర్తిస్తాయి. ఆరు స్లాబ్‌ల ద్వారా లైసెన్స్‌లు జారీ చేయనున్నట్టు నోటిఫికేషన్‌లో ప్రభుత్వం వెల్లడించింది. మద్యం షాపు కోసం కొనుగోలు చేసిన దరఖాస్తు ఫీజు తిరిగి చెల్లించబడదు. ఒక వ్యక్తి, లేదా సంస్థలు ఎన్ని దరకాస్తులనైనా కొనుగోలు చేయవచ్చు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎక్సైజ్ ఫీజును ప్రభుత్వం నిర్ణయించింది.

5 వేల జనాభాకు రూ.50 లక్షలు, ఐదు వేల నుంచి 50 వేల జనాభాకు రూ.55 లక్షలు, 50 వేల నుంచి లక్ష జనాభాకు రూ. 60 లక్షలు, లక్ష నుంచి ఐదు లక్షల జనాభాకు రూ.65 లక్షలు, ఐదు లక్షల నుంచి 20 లక్షల జనాభాకు రూ.85 లక్షలు, 20 లక్షలపైగా జనాభా ఉన్న ప్రాంతాల్లోని షాపులకు రూ.110 లక్షల (కోటి పదిలక్షలు) సంవత్సరం ఫీజుగా ఉంటుందని ప్రభుత్వం తెలిపింది. షాపులు పొందిన వారు ఆరు వాయిదాల్లో ఫీజు చెల్లించేందుకు వెసులు బాటు కల్పించారు.

యూరియా కోసం రైతులతో కాళ్లు మొక్కిస్తున్న రేవంత్‌రెడ్డి

- ఎమ్మెల్యే హరీశ్‌రావు

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ సిఎం కెసిఆర్ గోదావరి జలాలతో రైతుల పాదాలు కడిగితే.. ఈ సిఎం రేవంత్ రెడ్డి యూరియా కోసం రైతులతోనే పోలీసుల కాళ్లు మొక్కిస్తున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. సద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలో బుధవారం మహిళాశక్తి స్వగృహ భోజనశాల, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం బిఆర్ఎస్ మండల అధ్యక్షులు ఆనగోని లింగంగౌడ్ అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. 51 సార్లు డిల్లీ వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డికి యూరియా ఇచ్చే తెలివి.. ముందుచూపు లేదని విమర్శించారు. అందాల పోటీలపై పెట్టిన శ్రద్ధ, యూరియా సరఫరాలో లేదన్నారు. యూరియా ఇవ్వని కాంగ్రెస్ నాయకులకు గ్రామాల్లో తిరిగే హక్కు లేదన్నారు. మంత్రులను, కాంగ్రెస్ నేతలను తిరగనివ్వం.. ఎక్కడికక్కడా అడ్డుకుంటామని హెచ్చరించారు. వెంటనే రైతులకు సరిపడా యూరియా అందించాలని, లేదంటే ఉద్యమాన్ని తీవ్రం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ ఫెయిల్ అయిందన్నారు. ఏ ఎన్నికలు పెట్టినా కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపిపి జాప శ్రీకాంత్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు ఎడ్ల సోమిరెడ్డి, రాగుల సారయ్య పిఎసిఎస్ చైర్మన్ కోల రమేశ్‌గౌడ్, బిఆర్ఎస్ నాయకులు గుండు భూపేశ్, మల్లయ్య, వెంకట్‌రెడ్డి, మహేందర్‌గౌడ్ ఉన్నారు.

ఇద్దరి పిల్లలను చంపి ఆత్మహత్యకు యత్నించిన తల్లి

- బాచుపల్లిలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భార్యాభర్తల మధ్య గొడవలు అభం శుభం తెలియని చిన్నారుల ప్రాణం తీశాయి. భర్తతో గొడవల నేపథ్యంలో క్షణికావేశంలో ఓ మహిళ తన ఇద్దరు పిల్లలను సంపులో వేసి చంపేసింది. ఆ తర్వాత తానూ ఆత్మహత్యకు యత్నించింది. ఈ ఘటన హైదరాబాద్ బాచుపల్లిలో జరిగింది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా పిట్లంకు చెందిన లక్ష్మణ్, రత్నమ్మ దంపతులు ఉపాధి కోసం వచ్చి బాచుపల్లిలో నివాసం ఉంటున్నారు. వారికి నలుగురు సంతానం. కాగా పెద్ద కుమారులు జగన్, పవన్ సొంత ఊరిలోనే ఉంటున్నారు. అరుణ్ (3), సుభాన్ (8 నెలలు) వారి వద్ద ఉంటున్నారు. కొంతకాలంగా దంపతుల మధ్య కుటుంబ నియంత్రణ, ఇతర ఆర్థిక విషయాల్లో విభేదాలు ఉన్నాయి. ఇదే విషయమై బుధవారం తెల్లవారుజామున భార్యాభర్తలిద్దరూ గొడవపడ్డారు. అనంతరం లక్ష్మణ్ బయటికి వెళ్లిపోవడంతో రత్నమ్మ ఇద్దరు చిన్న కుమారులను తాము ఉంటున్న అద్దె ఇంట్లోనే నీటి సంపులో వేసి చంపేసింది. ఆ తర్వాత ఆమె కూడా అదే సంపులో దూకింది. పక్కింటి వారు గమనించి వెంటనే రత్నమ్మను బయటికి తీశారు. అనంతరం పిల్లలను సంపులోంచి బయటికి తీయగా అప్పటికే చనిపోయారు. స్థానికుల ఫిర్యాదు మేరకు బాచుపల్లి పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. రత్నమ్మను గాంధీ ఆస్పత్రికి తరలించారు. పిల్లల మృతదేహాలను ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యర్థాలు వదులుతున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

చెరువు కుంటల్లోకి వ్యర్థ జలాలు

- పరిశ్రమ ప్రతినిధులను నిలదీసిన రైతులు
- తహశీల్దార్‌కు అన్నదాతల ఫిర్యాదు
- నీటిని పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండల కేంద్రమైన చౌటకూర్ గ్రామ శివారులో గల గణపతి డిస్టిలరీ పరిశ్రమ నిర్వాహకులు గుట్టుచప్పుడు కాకుండా వ్యర్థ జలాలను చెరువు కుంటల్లోకి వదులుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన గ్రామస్తులు, రైతులు బుధవారం పరిశ్రమ యాజమాన్యాన్ని నిలదీశారు. దీంతో అధికారులు వచ్చి పరిశీలించారు. వివరాల్లోకి వెళ్లితే.. సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిలో ఉన్న గణపతి షుగర్స్ ఫ్యాక్టరీ నుంచి మొలాసిస్‌ను చౌటకూర్ డిస్టిలరీ పరిశ్రమకు తరలిస్తారు. ఇక్కడ లిక్కర్, ఇతర మద్యం తయారీకి ఈ స్పిరిట్‌ను వినియోగిస్తారు. పరిశ్రమలో మొలాసిస్‌ను పెద్దఎత్తున నిల్వ చేశారు. వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీనిని ఆసరాగా చేసుకున్న పరిశ్రమ యాజమాన్యం రాత్రి వేళల్లో గుట్టుచప్పుడు కాకుండా వరద ప్రవాహంలో మొలాసిస్ వ్యర్థాలను వదులుతోంది. దీంతో పరిశ్రమ సమీపంలోని కోమటి చెరువు, ఈదుల కుంటల్లోకి ప్రవహించే మంచి నీరంతా కలుషితమవుతోంది. వర్షాలు కురుస్తుండటంతో రహస్యంగా రాత్రి వేళల్లో వ్యర్థ జలాలను వదులుతుండటంతో పంట పొలాలు దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు. ఈ విషయమై రైతులు తహశీల్దార్ అనుదీప్‌కు ఫిర్యాదు చేశారు. కలుషిత వ్యర్థ జలాలను పరిశీలించి నివేదిక అందజేయాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) ప్రమోద్‌కు తహశీల్దార్ సూచించడంతో ఆయన బుధవారం పరిశ్రమ వద్ద కలుషిత నీటిని పరిశీలించారు. పరిశ్రమ లోపలి నుంచి వ్యర్థ జలాలు బయటకు వస్తుండటాన్ని పరిశీలించిన ఆర్ఐ ప్రమోద్ నివేదిక తయారు చేసి తహశీల్దార్‌కు అందజేశారు.

మేడారం జాతరకు రూ.150 కోట్లు మంజూరు

- ఉత్తర్వులు జారీ చేసిన గిరిజన సంక్షేమ శాఖ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర నిర్వహణ కోసం తెలంగాణ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. గిరిజనుల ఆధ్యాత్మిక కుంభమేళాగా పిలిచే ఈ మహోత్సవం విజయవంతంగా సాగేందుకు, మేడారం లో శాశ్వత నిర్మాణాలు, రహదారులు, తాగునీటి సదుపాయాలు, విద్యుత్, పారిశుధ్యం వంటి మౌలిక వసతుల అభివృద్ధి పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.150 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గిరిజన సంక్షేమ శాఖ నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది. నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్‌లకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) కృతజ్ఞతలు తెలిపారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి ప్రసన్నకుమార్

గర్భిణి మృతి కేసులో ఏడుగురు అరెస్ట్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

లింగ నిర్ధారణ పరీక్ష నిర్వహించడంతోపాటు అక్రమంగా అబార్షన్ చేసి గర్భిణి మృతికి కారణమైన ఏడుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మృతురాలి భర్త సహా లింగనిర్ధారణ పరీక్ష చేసినవారు, అక్రమంగా అబార్షన్ చేసిన ఇద్దరు ఆర్ఎంపిలు, స్కానింగ్ నిర్వహించిన వారితో పాటు సహకరించిన వారిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని డిఎస్‌పి కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశంలో డిఎస్‌పి ప్రసన్నకుమార్ మీడియాకు వివరాలు వెల్లడించారు.

తుంగతుర్తి పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు 108/25 ప్రకారం.. మద్దిరాల మండలం, గోరంట్ల గ్రామానికి చెందిన విజిత (మృతురాలు) మూడోసారి గర్భం దాల్చింది. మళ్లీ ఆడ బిడ్డే పుడుతుందేమోనని ఆమె భర్త బయగల శ్రీను ఆమెకు ఐదో నెలలో ఖమ్మం పట్టణంలోని ప్రయివేట్ క్లినిక్‌లో లింగ నిర్ధారణ పరీక్ష చేయించాడు. కడుపులో ఆడ శిశువు ఉన్నట్టు చెప్పడంతో తుంగతుర్తి సాయిబాలాజీ ఆస్పత్రిలో అబార్షన్ చేయించాడు. అయితే, తీవ్ర రక్తస్రావం కారణంగా విజిత పరిస్థితి విషమించింది. ఖమ్మం తరలిస్తుండగా మృతిచెందింది. తుంగతుర్తి సిఐ నరసింహారావు నేతృత్వంలో పోలీసులు విచారణ జరపగా.. మృతురాలి భర్త తప్పుడు ఫిర్యాదు చేసినట్టు.. వాస్తవానికి అబార్షన్ సమయంలోనే విజిత మృతిచెందినట్టు బయటపడింది. దాంతో అబార్షన్ చేసిన ఆర్ఎంపి బండి శ్రీనివాస్, సహకరించిన పానుగంటి సతీష్, లింగనిర్ధారణ పరీక్ష నిర్వహించిన ల్యాబ్ టెక్నీషియన్ సంపేట అశోక్, పరికరం సమకూర్చిన పులి వీరభద్రరావు, ఏర్పాట్లు చేసిన నర్సు తుమ్మచర్ల అరుణ, కల్పన క్లినిక్ నిర్వాహకురాలు పోలంపల్లి కల్పన, మృతురాలి భర్త బయగల శ్రీనుపై కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు. ఆ తర్వాత రిమాండ్‌కు తరలించారు. ముందస్తు లింగనిర్ధారణ పరీక్షలు, అనర్హులు వైద్యం చేయడం చట్టపరమైన నేరమని డిఎస్‌పి హెచ్చరించారు. ఇలాంటి అక్రమ చర్యలకు పాల్పడిన ఆస్పత్రులు, మెడికల్ షాపులను సీజ్ చేస్తామని, సహకరించిన వారిని కూడా శిక్షార్హులుగా భావించి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

లైంగిక దాడి కేసులో స్పెషల్‌కోర్టు సంచలన తీర్పు

- నిందితుడికి జీవిత ఖైదు, రూ.55 వేల జరిమానా

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బాలికపై లైంగిక దాడి కేసులో ఎల్బీనగర్ ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ కోర్టు బుధవారం సంచలన తీర్పు వెల్లడించింది. నిందితుడికి జీవిత ఖైదు, రూ.55 వేల జరిమానాతోపాటు బాధితులకు రూ. ఐదు లక్షల నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ తొమ్మిదేళ్ల బాలికకు ఆటోడ్రైవర్ షేక్‌సలీం (30) మాయమాటలు చెప్పి లైంగికదాడికి ఒడిగట్టాడు. 2022, జూన్ 10న బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు ఎల్బీనగర్ పోలీసులు నిందితుడిపై ఎస్‌సి, ఎస్‌టి, పోక్సో కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. రాచకొండ సిపి ఆదేశాలతో అప్పటి ఎసిపి పి శ్రీధర్‌రెడ్డి (ప్రస్తుతం ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేస్తున్నారు) కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితుడు బాలికపై మూడ్రోజులు అఘాయిత్యం చేసినట్టు విచారణలో తేల్చారు. ఓ మహిళా అధికారి సమక్షంలో బాధితురాలికి వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆమె నుంచి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. సాక్ష్యాలను సేకరించి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. కోర్టు అనుమతితో డీఎన్ఏ పరీక్షలు చేయించారు. పక్కాగా సాక్ష్యాలు సేకరించి 60రోజుల్లోనే కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. అప్పటి నుంచి అన్నికోణాలో విచారించిన ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ జడ్జి బుధవారం తీర్పు వెలువరించారు. ఫోక్సో చట్టంతోపాటు ఎస్‌సి, ఎస్‌టి చట్టం ప్రకారం నిందితుడికి జీవిత ఖైదు విధించారు. బాధితులకు న్యాయం జరగడంలో ఎసిపి పి శ్రీధర్‌రెడ్డి చేసిన కృషి ఎంతో ఉందని రాచకొండ సిపి ప్రత్యేకంగా ప్రశంసించారు. ఇందుకు సహకరించిన పిపి బి సునీత, డి రఘు, శోభారాణితోపాటు పలువురిని సిపి అభినందించారు.